క్లుప్తంగా

మృతురాలు ఆచూకీ గుర్తింపు

సంగం: సదరన్ చానల్‌లో శనివారం వెలుగు చూసిన గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం ఆచూకీ లభించినట్లు ఎస్సై నాగార్జున రెడ్డి తెలిపారు. ఆత్మకూరు మండలం నల్లపరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిల్లకూరు కాంతమ్మ (85)గా గుర్తించామన్నారు. మతిస్థిమితం సరిగా లేని కాంతమ్మ గురువారం ఉదయం ఓజిలిలోని పెద్ద కుమారుడి ఇంటి వద్ద నుంచి బయటకు వచ్చేసింది కుటుంబ సభ్యులు కాంతమ్మ కోసం తీవ్రంగా గాలించినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అరవపాళెం సమీపంలోని సదరన్ చానల్ లాకుల వద్ద ఆమె మృతదేహం కనిపించడంతో స్థానికుల సమాచారంతో బయటకు తీసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెంలో ఉంచగా ఆదివారం కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. జెండాదిబ్బ వీఆర్‌ఓ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కల్యాణ మండపానికి భూమిపూజ



ఆత్మకూరు: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయ సమీపంలో నూతన కల్యాణ మండపం నిర్మాణానికి దేవస్థాన కమిటీ మెంబర్లు, భక్తులు భూమి పూజలు నిర్వహించారు. పురాతన ఆలయం జీర్ణోద్ధరణ సమయంలో భక్తులు అందించిన సహకారం మరువలేనిదని, కల్యాణ మండపం నిర్మాణానికి సహకరించాలని కమిటీ కోరింది. త్వరలోనే ప్రజల సహకారంతో కల్యాణ మండపం నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాత కంచి పరమేశ్వరరెడ్డి, ఆలయ నిర్వాహకులు కేవీ శేషారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సోమవరపు యానాదిరెడ్డి, కంది చంద్రారెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

హైవేపై విద్యుత్‌లైట్ల పునరుద్ధరణ

వరికుంటపాడు: వరికుంటపాడు వద్ద 565 జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఆదివారం హైవే సిబ్బంది పునరుద్ధరించారు. డివైడర్స్‌పై హైవే అధికారులు గ్రామ పరిధిలో విద్యుత్ లైట్స్ ఏర్పాటు చేశారు. అవి కొంతకాలంగా మరమ్మతులకు గురయ్యాయి. దీంతో రాత్రివేళ హైవేపై అంధకారం నెలకొనడంతో ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. తిరిగి హైవే సిబ్బంది లైట్లకు మరమ్మతులు చేసి పునరుద్ధరించడంతో పంచాయతీ సర్పంచ్ కె.దిలీప్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైవే పెట్రోలింగ్ అధికారి వెంకటగిరి, లైన్‌మన్ చందు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న నరసారెడ్డి

చేజర్ల: ప్రతి ఒక్కరు ధ్యానం చేయాలని, తద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందని పిరమిడ్ ధ్యాన ఇంజినీర్ నరసారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని పులనీళ్లపల్లి వెంకయ్యస్వామి మందిరం ధ్యానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ధ్యానం ద్వారా జ్ఞానం సమకూరుతుందని, మౌనం విలువను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు పిరమిడ్ ధ్యాన కేంద్రం సభ్యుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అత్త తిడుతోందని..

- వివాహిత అదృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం: అత్త తిడుతోందని మనస్తాపానికి గురైన వల్లూరు హేమలత అనే వివాహిత ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన మండలంలోని కాగులపాడులో శనివారం జరిగింది. దీనిపై ఆదివారం బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు.. కాగులపాడుకు చెందిన వల్లూరు అనిల్‌తో హేమలతకు వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా హేమలతను అత్త పుష్పమ్మ కారణం లేకుండా తిడుతోందని చెబుతున్నారు. దీంతో ఆమె శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న అనిల్ భార్య కోసం గాలించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

షార్ విశ్రాంత ఉద్యోగులకు సత్కారం

నెల్లూరు రూరల్: పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో షార్ విశ్రాంత ఉద్యోగులను జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. శేషయ్య, మోహన్‌రావు, రత్నం, హుస్సేన్‌ను సన్మానించారు. వాకర్స్ డిప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి, ప్రసాద్, ఖాజామస్తాన్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్.. బయటకు రాలేం

- చంద్రబాబు అరెస్ట్‌పై స్పందించని తమ్ముళ్లు
- పార్టీ అధిష్టానం నిరసనలు, నిరాహార దీక్షలకు పిలుపు
- అయినా కదలని టీడీపీ కేడర్
- నియోజకవర్గ ముఖ్య నేతలంతా ముఖం చాటివేత
- బాబు తప్పు చేశాడన్న భావనలో తెలుగు తమ్ముళ్లు



ఉదయగిరిలో నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తున్న టీడీపీ నేతలే వీరే

ఉదయగిరి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో అవినీతికి పాల్పడిన కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో ఆ పార్టీ శ్రేణులు బయటకు వచ్చేందుకు సుముఖత చూపడం లేదు. చంద్రబాబు తప్పు చేసి అడ్డంగా దొరికిపోతే.. ఏ ముఖం పెట్టుకుని బయటకు రావాలని ఆ పార్టీ ముఖ్య నేతలను ప్రశ్నించడంతో నియోజకవర్గ ఇన్‌చార్జీలు సైతం ముఖం చాటేశారు. చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి నిరసన ర్యాలీలు, నిరాహార దీక్షలు, అల్లర్లు, గొడవలు సృష్టించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చినప్పటికీ ఉదయగిరిలో తెలుగు తమ్ముళ్లు స్పందించలేదు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవడంతో టీడీపీ కార్యకర్తలు, నేతలు గానీ చంద్రబాబుకు మద్దతుగా బయటకు రాలేదు. ఉదయగిరిలో టీడీపీ ద్వితీయ శ్రేణి నేతలు ఐదారుగురు నిరసన తెలిపేందుకు ప్రయత్నించారు. 144 సెక్షన్‌లో ఉన్నందున అనుమతి లేకుండా నిరసన చేయడం తగదని ఎస్సై ఇంద్రసేనారెడ్డి వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొండాపురం టీడీపీ మండల కార్యాలయంలో వేళ్ల మీద లెక్కించగలిగే కొద్ది మంది కార్యకర్తలు నిరాహార దీక్షకు పూనుకున్నారు. అయితే పోలీసులు వారికి నచ్చజెప్పి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. నియోజకవర్గంలో ఎక్కువ జనాభా కలిగిన వింజమూరు, కలిగిరి, జలదంకి మండలాల్లో ఒక్క టీడీపీ నేతగానీ, కార్యకర్త గానీ నిరసన తెలిపేందుకు ముందుకురాలేదు. సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లో కూడా పార్టీ కేడర్ చంద్రబాబుకు మద్దతుగా ఎలాంటి కార్యకలాపాలు చేయకపోవడం విశేషం.

తప్పు చేశాడన్న భావనతో టీడీపీ కేడర్

చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో అవినీతికి పాల్పడినట్లు సీఐడీ సాక్ష్యాధారాలతో రుజువు చేయడంతో టీడీపీ కేడర్ కూడా నిస్సహాయ స్థితిలో ఉండిపోయింది. తమ అధినేత తప్పు చేసి అడ్డంగా దొరికిపోతే ఆయన తప్పు చేయలేదని పబ్లిక్‌లోకెళ్లి నిరసన తెలిపితే మనం ప్రజల దృష్టిలో మరింత చులకన అవుతామనే భావనతో పార్టీ ముఖ్య నేతలు, ద్వితీయ శ్రేణి నేతలు అధిష్టానం ఇచ్చిన పిలుపునకు దూరంగా ఉండిపోయారు. పైగా ఏసీబీ కోర్టులో చంద్రబాబు అరెస్ట్‌పై సుదీర్ఘంగా వాదన జరుగుతున్న తరుణంలో బాబు తరఫున వాదించే న్యాయవాదులు చంద్రబాబుకు ఈ స్కాంలో ప్రమేయం లేదని గానీ, డబ్బులు అతనికి ముట్టలేదని గానీ వాదించకపోవడం కూడా పార్టీ కేడర్ తమ నేత తప్పు చేశాడన్న భావనతో ఉన్నారు.

ముఖం చాటేసిన ముఖ్య నేతలు

ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొల్లినేని వెంకటరామారావు చంద్రబాబుకు మద్దతుగా నియోజకవర్గంలో ఎక్కడ కూడా నిరసన కార్యక్రమం చేపట్టలేదు. ఆయన అనారోగ్యం పేరుతో బాబును అరెస్ట్ చేసిన రోజే హైదరాబాద్ వెళ్లిపోయారు. వివిధ సేవా కార్యక్రమాల పేరుతో టీడీపీ టికెట్ ఆశిస్తున్న కాకర్ల సురేష్ కూడా ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనలేదు. టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి బాబుకు మద్దతుగా కనీసం తన సొంత మండలంలోని కేడర్‌ను కూడా పురమాయించలేదు. జిల్లా టీడీపీ నేత, ఉదయగిరికి చెందిన మాజీ జెడ్పీ చైర్మన్ చెంచలబాబుయాదవ్ శనివారం కలిగిరిలో కొద్దిసేపు కనిపించినప్పటికీ ఆదివారం ఎక్కడ కూడా ఆయన ఆచూకీ కనిపించలేదు. వివిధ మండలాలకు చెందిన పార్టీ కన్వీనర్లు కూడా ఆదివారం బాబుకు మద్దతుగా ఎలాంటి నిరసన కార్యక్రమాలు చేపట్టకపోవడం విశేషం. మొత్తం మీద చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపుకు నియోజకవర్గంలోని టీడీపీ ముఖ్య నేతలు, ద్వితీయ స్థాయి నేతలు, కార్యకర్తలు స్పందించకపోవడం గమనించదగ్గ విషయం.



సంక్షేమ పథకాల లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ప్రజలకు పారదర్శక పాలన

ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రజల సొమ్ముకు భద్రత కల్పిస్తూ ఎక్కడా ఎటువంటి లంచాలు లేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు పారదర్శక పాలనతో నాణ్యమైన సేవలు అందిస్తుందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 40వ వార్డులో ఆదివారం ఎమ్మెల్యే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు వివరాలను లబ్ధిదారులకు వివరించి వారికి బుక్‌లెట్‌లను అందజేశారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తూ, రాష్ట్ర ప్రజల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమని చెప్పారు. కులం, మతం, వర్గం, ప్రాంతం వంటి వాటికి అతీతంగా ప్రజా సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమల అవుతున్నాయన్నారు. మధ్యవర్తులు లేకుండా గ్రామాల్లో సామాజిక పింఛన్లు పొందడంతో అర్హులు సుఖ సంతోషాలతో ఉన్నారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా అధికారం చేపట్టినప్పటి నుంచి, సంక్షేమ పథకాలు ప్రతి గడపకు వెల్లువలా చేరుతున్నాయన్నారు. ఒకప్పుడు సామాజిక పింఛన్ టీడీపీకి చెందిన వారికే మంజూరు చేసేవారని గుర్తు చేశారు. గతంలో పింఛన్లు పొందేందుకు గ్రామ నాయకుల చుట్టూ, మండల కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు ఉండేవన్నారు. నేడు గ్రామ/వార్డు స్థాయిలో సచివాలయాలు ద్వారా రైతు భరోసా, చేయూత, ఆసరా, అమ్మ ఒడి, విద్యా దీవెన ఇలా ప్రతి ప్రభుత్వ పథకంతో పాటు నేరుగా పలు సేవలు ప్రజలకు అందుతున్నాయన్నారు. కావలి నియోజకవర్గం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం మొదలు పెట్టారని చెప్పారు. వచ్చే సంక్రాంతికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం చేసి ప్రజల చిరకాల కోరికను తీర్చుతామని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, డేగా రామయ్య యాదవ్, షేక్ మునీర్ జాన్, కుందుర్తి శ్రీనివాసులు, పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, దామిశెట్టి సుధీర్‌నాయుడు, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

భర్త ఇంటి ముందు రెండో భార్య దీక్ష



భర్త పోలయ్య ఇంటి ముందు దీక్ష చేస్తున్న రెండో భార్య మస్తాన్‌బీ

చేజర్ల (సోమశిల): భర్త ఇంటి ముందు అతని రెండో భార్య దీక్షకు దిగిన ఘటన అనంతసాగరం మండలం రేవూరులో ఆదివారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. రేవూరుకు చెందిన పోలయ్య అనంతసాగరం విద్యాశాఖ కార్యాలయంలో సీఆర్‌పీగా విధులు నిర్వహిస్తున్నారు. పోలయ్యకు ఇదివరకే పెళ్లి అయింది. మనస్పర్థలు కారణంగా భార్యాభర్తలు విడిపోయారు. దీంతో మస్తాన్‌బీ అనే మహిళ అతనికి దగ్గర కావడంతో 12 ఏళ్ల నుంచి సహ జీవనం చేస్తున్నట్లు తెలిపారు. పోలయ్య మరో పెళ్లి చేసుకుని మస్తాన్‌బీని వదిలించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుసుకుని ఆమె ఈ విషయమై రెండు నెలల క్రితం జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. శనివారం రాత్రి భర్త పోలయ్య, అతని మూడో భార్య, బంధువుల మస్తాన్‌బీపై దాడి చేశారు. తీవ్ర గాయాలైన అక్కడే కూర్చుని దీక్ష కొనసాగిస్తోంది. తనకు న్యాయం చేయాలని ఆమె కోరుతోంది.

కలశ ప్రతిష్టలో రాజారెడ్డి



కలశ ప్రతిష్ట పూజల్లో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో రామాలయంలో నిర్మించిన గణేషుడి మండపం కలశ ప్రతిష్ట ఆదివారం జరిగింది. వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ గ్రామంలో వినాయకుడి ఆలయం నిర్మించి ప్రాణప్రతిష్ట చేయడం తనకెంతగానో ఆనందం ఉందన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ధ్వజారోహణ పూజ



వినాయక ఉత్సవాల కోసం ధ్వజ ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు: పట్టణంలోని జేఆర్‌పేట ఎక్స్‌టెన్షన్ ఏరియా కూడలిలో నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాల కోసం ఆదివారం ధ్వజారోహణ, స్తంభ ప్రతిష్ట పూజలు నిర్వహించారు. గణేష్ భక్త మండలి సభ్యుల ఆధ్వర్యంలో 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న గణేష్ ఉత్సవాల కోసం ఆదివారం ధ్వజ ప్రతిష్ట పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేంద్రరెడ్డి, ఓబుల్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, జయనాగేశ్వరరావు, నలిశెట్టి శ్రీనివాసులు, సంపూర్ణమ్మ, సుధారాణి, కల్పన, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని అనుసరించాలి

జలదంకి: భారతదేశంలోని ప్రతి ఒక్కరూ హిందూ ధర్మసూత్రాలను ఆచరించాలని ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర నాయకులు కాలం బుజ్జిరెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణక్రాక విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం హిందూ ధర్మ సూత్రాలు, ఆచరించాల్సిన నియమాలు తదితరాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మార్లెళ్ల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో హిందూ ధర్మానికి ఉన్న ప్రాముఖ్యత ఎక్కడా లేదని, హిందూ దేవాలయాల అభివృద్ధికి బీజేపీ కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చల్లా హనుమారెడ్డి, తన్నీకంటి తరుణ్‌కుమార్, బొచ్చు నరసింహరావు, రామాల కృష్ణారెడ్డి, వంటేరు రాకేష్‌రెడ్డి, సూరి సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 19న చెరువు వేలం పాట

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలం పాతాళపల్లి ఎర్ర చెరువుకు వేలం పాటను ఈ నెల 19న నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎస్.తిరుపతయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు ఎర్ర చెరువులో చేపల పెంపకానికి సంబంధించి 1433 ఫసలీ కాలానికి వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న రూ.10 వేలు దరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చైర్మన్‌ను సీట్‌లో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. అల్లూరులోని నూకలపాటి వెంకటేశ్వరరెడ్డి ప్రాథమిక సహకార సంఘం సొసైటీ నూతన పాలకవర్గ త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. త్రిసభ్య కమిటీలో చైర్మన్‌గా మేడా శ్రీనివాసులరెడ్డి, డైరెక్టర్లుగా కరేటి దైవాదీనం, గండవరపు శీనయ్య బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన పాలకవర్గ సభ్యులు మండలంలోని రైతులకు ఎల్లవేళల తమ సేవలను అందించాలని కోరారు. రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలు అన్నదాతలకు అండగా ఉంటాయన్నారు. ఈ ఏడాది రైతులకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గిట్టుబాటు ధర లభించడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సాధ్యపడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, వైస్ ఎంపీపీ సురేంద్ర, ఏఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, షేక్ ఉస్మాన్ షరీఫ్, మధురెడ్డి, మునిరాజ్, నిమ్మల భాస్కర్, శేషయ్య, పోలయ్య, వెంకటేశ్వర్లు, భక్తవత్సలరెడ్డి పాల్గొన్నారు.


ఆనందానికి మించిన ఆస్తి లేదు



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న పిరమిడ్ ధ్యాన మాస్టర్ నరసారెడ్డి

ఆత్మకూరు: ప్రతి నిత్యం క్రమం తప్పకుండా ధ్యానం నిర్వహిస్తే అనారోగ్యాలు దరిచేరవని, ఆనందానికి మించిన ఆస్తులు లేవని ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన ప్రముఖ ధ్యాన మాస్టర్ నరసారెడ్డి తెలిపారు. ఆత్మకూరులోని శ్రీషిరిడీ సాయి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఆదివారం సాయంత్రం ధ్యానంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ధ్యానంతో కలిగే లాభాలు వివరించారు. ధ్యానం చేసేందుకు తొలుత ఇబ్బందిగా ఉన్నా అలవాటు పడిన అనంతరం ప్రతి నిత్యం చేసేందుకు సిద్ధపడతారని వివరించారు. ధ్యానం గురించి సంపూర్ణంగా తెలుసుకుని తోటి వారికి తెలియజేయాలని కోరారు. ధ్యానం ద్వారా ప్రాణశక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ కేంద్రం నిర్వాహకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ ఆత్మీయ సన్మానం



ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కావలి: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ (వైఎస్సార్‌టీఎఫ్) ఆధ్వర్యంలో గురుపూజోత్సవ ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఆదివారం స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా డివిజన్‌లోని 30 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని సత్కరించారు. వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం సుదర్శనం అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్, జలదంకి ఎంఈఓ నాగేశ్వరరావు, కొండాపురం ఎంఈఓ ఆనంద్, వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు రాజకుమార్, సురేష్, ఖాదర్ బాషా, హరిబాబు, రాజు, మాధవరెడ్డి సుధాకర్‌రెడ్డి భాస్కర్ నారాయణ, మునీర్ జాన్, నందనవనం మధు, వెంకట కృష్ణయ్య, జిలానీ బాషా, వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు గ్రామ దేవత పోలేరమ్మకు ఆదివారం మహిళలు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో గ్రామ దేవతకు పొంగళ్లు పెట్టడం ఆనవాయితీగా వస్తుంది. ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, పాడి పంటలు కలిగి చల్లగా ఉండాలని అమ్మవారికి ఏటా ఉత్సవాలు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కోర్టు తీర్పుపై టీడీపీ శ్రేణుల నిరసన



నిరసనలో పట్టుమని పది మంది కూడా లేని టీడీపీ కార్యకర్తలు

ఆత్మకూరు: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో పక్కా ఆధారాలతో దొరికిపోయిన టీడీపీ అధినేత చంద్రబాబుకు రిమాండ్ విధించడాన్ని నిరసిస్తూ టీడీపీ శ్రేణులు ఆదివారం రాత్రి నిరసనకు దిగాయి. కొందరు టీడీపీ నేతలు ముందుగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను సిద్ధం చేసి పెట్టుకుని స్థానిక మున్సిపల్ బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. స్కామ్‌లో చంద్రబాబు పాత్ర ఉందని ఏసీబీ కోర్టు రిమాండ్ విధించడంతో అది తట్టుకోలేక నెల్లూరుపాళెం సెంటర్‌కు చేరుకుని ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు ప్రయత్నం చేశారు. పోలీసులు వారి వద్ద నుంచి దిష్టిబొమ్మను స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేశారు. అయితే రోడ్డుపై పడి ఉన్న ఎండు గడ్డిని పోగు చేసి సీఎం దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్నామంటూ నినాదాలు చేశారు. అయితే టీడీపీ శ్రేణుల నిరసన కార్యక్రమాన్ని చూసి జనం అసహనం వ్యక్తం చేశారు. అవినీతి పరుడికి మద్దతుగా రోడ్ల మీదకు వచ్చి జనాన్ని ఇబ్బంది పెట్టడం ఏమిటని ఈసడించుకున్నారు. ప్రతిపక్ష నాయకుడు అరెస్ట్ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రశాంతంగా ఉండాలని, ఎలాంటి సంబరాలు చేయొద్దని పార్టీ పిలుపునిచ్చింది. అయితే టీడీపీ శ్రేణులు సోమవారం బంద్‌కు పిలుపునివ్వడం గమనార్హం. పట్టణంలోని 144వ సెక్షన్ అమల్లో ఉన్న క్రమంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

న్యాయమే గెలిచింది



చంద్రబాబుకు రిమాండ్ విధించడంతో న్యాయం గెలిచినట్లు అయింది. చంద్రబాబు ఇన్నాళ్లు చేసిన అవినీతి అక్రమాలను స్టేలు తెచ్చుకుని తాను నిప్పు.. ఉప్పు అంటూ చెప్పుకొచ్చాడు. స్కిల్ స్కామ్‌తో ఇప్పుడు ఆయన అవినీతి ఆధారాలు బయటపడ్డాయి. చంద్రబాబు రాజకీయమంతా తప్పించుకోవడమే.

– బూదర్ల వీరరాఘవరెడ్డి, చేజర్ల మండల సొసైటీ అధ్యక్షుడు

అవినీతి అనకొండ చంద్రబాబు



దేశంలో చంద్రబాబును మించిన అవినీతి పరుడు మరొకడు లేడు. బాబు అవినీతిలో అనకొండ వంటి వాడు. ప్రజాస్వామ్యదేశంలో ఎవరు అవినీతికి పాల్పడిన శిక్ష అనుభవించాల్సిందే. ఇన్నాళ్లు అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసిన చంద్రబాబు చివరకు జైలు పాలవడం తప్ప లేదు. కుట్రలు చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య.

– అక్కలరెడ్డి అంకిరెడ్డి, అనంతసాగరం మండల జేసీఎస్ కో ఆర్డినేటర్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అల్లూరు: స్థానిక రామకృష్ణా డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం కమ్యూనిటీ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ) సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు కె.చిరంజీవి, కె.కళ్యాణి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి, వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఈ కాలంలో అతిసార, జ్వరం, మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా పరసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. దాదాపు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ జిల్లా కన్వీనర్ శాఖవరపు వేణుగోపాల్, అల్లూరు మండల నాయకులు ఓ మస్తానయ్య, ఎం.దయాకర్ రావు, డి.విజయ్‌కుమార్, ఆర్.వెంకయ్య, ఎం.సాయినాథ్‌సింగ్, వై.వెంకట్రావు, షేక్ బషీర్, ఎం విక్రమ్, డి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే కొంతమంది ఉపాధ్యాయులను ఇటీవల జిల్లా విద్యాశాఖ అధికారులు జిల్లా, మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రకటించిన నేపథ్యంలో వారిని ఏపీటీఎఫ్-1038 ఉపాధ్యాయ సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన సీహెచ్ మాలకొండయ్య, జె.వనజాక్షి, పర్వీన్, ఎం.విజయలక్ష్మి, ప్రభావతి, కలాం, జె.వెంకటేశ్వర్లు, పి.రమణారెడ్డి, విజయకుమారి, చెన్నారెడ్డి, అర్చన, కామేశ్వరిలను ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు డీసీ వెంగయ్య, డి.వెంగయ్య, బి.సుధాకర్‌రావు, మల్లికార్జున్‌రావు, నారాయణ, చినబాబు, శివకోటారెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.